పారిశ్రామిక విధానం

పరిశ్రమలను ఏ ప్రాంతంలో నెలకొల్పాలి? ఎలాంటి పరిశ్రమలు నెలకొల్పాలి? ఏ పరిశ్రమలు ఎవరి యాజమాన్యంలో ఉండాలి? లాంటి విషయాలను పారిశ్రామిక విధానం తెలియజేస్తుంది. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం వివిధ పారిశ్రామిక విధానాలను ప్రకటించింది. వాటిలో 1948, 1956, 1977, 1980, 1985, 1991 విధానాలు ముఖ్యమైనవి.

1948 పారిశ్రామిక విధానం

నాటి పరిశ్రమల మంత్రి శ్యాంప్రసాద్ ముఖర్జీ 1948, ఏప్రిల్ 6న మొదటి పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. ఇందులో పరిశ్రమలను నాలుగు రకాలుగా వర్గీకరించారు.

- దేశ రక్షణ తత్సంబంధ పరిశ్రమలు పూర్తిగా ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయి.
  ఉదా: ఆయుధ సామగ్రి, అణుశక్తి, రైల్వేలు
- 2వ రకం పరిశ్రమలు ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తుల అధీనంలో ఉన్నాయి. కాబట్టి పదేళ్ల వరకు వారే నిర్వహిస్తారు. పదేళ్ల తర్వాత జాతీయం చేసే విషయం ప్రభుత్వం పరిశీలిస్తుంది.
  ఉదా: బొగ్గు, ఇనుము, ఉక్కు, విమానాల ఉత్పత్తి, నౌకా నిర్మాణం, టెలిఫోన్, టెలిగ్రాఫ్, వైర్‌లెస్
- 3వ రకమైన వాటిలో జాతీయ ప్రాముఖ్యం ఉన్న 21 పరిశ్రమలున్నాయి. వీటిని ప్రైవేట్ రంగం నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ నియంత్రణకు లోబడే పని చేస్తాయి.
  ఉదా: భారీ యంత్రాలు, యంత్ర పరికరాలు, రసాయనిక ఎరువులు, ట్రాక్టర్లు మొదలైనవి.
- పైన పేర్కొన్నవి మినహా మిగిలినవన్నీ ప్రైవేట్ రంగంలోనే ఉంటాయి.

సమీక్ష: 1948 పారిశ్రామిక విధానం భారత ఆర్థిక వ్యవస్థను ఒక మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా రూపొందించింది. పదేళ్ల తర్వాత జాతీయం చేయవచ్చనే అంశం వల్ల ప్రైవేటు వ్యక్తులు ఆ పరిశ్రమల అభివృద్ధిపై శ్రద్ధ చూపలేదు.

1956 పారిశ్రామిక విధానం

2వ పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రెండేళ్ల ముందుగానే 1956 విధానాన్ని ప్రకటించారు. ఈ విధానంలో పరిశ్రమలను మూడు తరగతులుగా విభజించారు.

జాబితా 'ఎ' పరిశ్రమలు

ఇందులో 17 రకాల పరిశ్రమలున్నాయి. వీటిని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిదే.
ఉదా: ఆయుధాలు, అణుశక్తి, రైల్వేలు విమానాల తయారీ, నౌకా నిర్మాణం, టెలిఫోన్, టెలిగ్రాఫ్, వైర్‌లెస్ మొదలైనవి.

జాబితా 'బి' పరిశ్రమలు

ఇందులో 12 పరిశ్రమలున్నాయి.
ఉదా: రసాయనిక ఎరువులు, సింథటిక్, రబ్బరు, రోడ్డు రవాణా, సముద్ర రవాణా మొదలైనవి. వీటిని ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ రంగ సంస్థలు కూడా ప్రభుత్వంతో కలిసి స్థాపించవచ్చు.

జాబితా-'సి' పరిశ్రమలు

మిగిలిన పరిశ్రమలన్నీ ప్రైవేట్ రంగానికే కేటాయించారు.
సమీక్ష: 1956 విధానాన్ని ''ఆర్థిక రాజ్యాంగం''గా వర్ణిస్తారు.

1973 పారిశ్రామిక విధానం

ఇది సంయుక్త రంగానికి ప్రాధాన్యమిచ్చింది.

1977 పారిశ్రామిక విధానం

దీన్ని జనతా ప్రభుత్వ కాలంలో ప్రకటించారు. చిన్న పరిశ్రమలకు ప్రాధాన్యమిచ్చిన మొదటి తీర్మానం ఇది.

- ఈ విధానం మేరకు జిల్లా పారిశ్రామిక కేంద్రాలను (DIC) స్థాపించారు.
- చిన్నతరహా పరిశ్రమలకు రిజర్వ్ చేసిన జాబితాను 180 నుంచి 807కు పెంచారు.
- చిన్నతరహా పరిశ్రమల పెట్టుబడి పరిమితిని పది లక్షలకు, అనుషంగిక పరిశ్రమల పెట్టుబడి పరిమితిని పదిహేను లక్షలకు పెంచారు.

1980 పారిశ్రామిక విధానం

''ఆర్థిక ఫెడరలిజం'' అనే భావనను ప్రవేశపెట్టారు.

- చాలా చిన్న పరిశ్రమల పెట్టుబడిని లక్ష నుంచి రెండు లక్షలకు, చిన్నతరహా పరిశ్రమల పెట్టుబడిని 10 నుంచి 20 లక్షలకు, అనుషంగిక పరిశ్రమల పెట్టుబడి పరిమితిని 15 నుంచి 20 లక్షలకు పెంచారు.

1985 పారిశ్రామిక విధానం

ఉత్పాదకతను పెంచడానికి, ఉత్పత్తి వ్యయాలు తగ్గించడానికి, నాణ్యతను పెంచడానికి దోహదపడింది. ఎంఆర్‌టీపీ చట్ట పరిధిలోని ఆస్తుల

పరిమితిని 20 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచారు. దిగుమతుల విధానాన్ని సరళీకృతం చేశారు. బ్రాడ్‌బాండింగ్(Broad Banding) విధానాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టారు.

1990 పారిశ్రామిక విధానం

దీన్ని జనతాదళ్ ప్రభుత్వం ప్రకటించింది. చిన్న పరిశ్రమలకు ఆర్థిక వనరులందించడానికి, సిడ్బి (SIDBI) స్థాపనకు ఇది దోహదపడింది.

1991 నూతన పారిశ్రామిక విధానం

అనవసర అధికార నియంత్రణ నుంచి భారత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించడం, భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో మమేకం చేయడం, నష్టాలతో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల భారాన్ని తగ్గించడం లాంటి లక్ష్యాలతో పి.వి. నర్సింహారావు ప్రధానిగా, మన్మోహన్‌సింగ్ ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు రెండు దఫాలుగా నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు.

పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం రద్దు

పద్దెనిమిది రకాల పరిశ్రమలు మినహా మిగిలిన అన్ని పరిశ్రమలను లైసెన్సింగ్ పరిధి నుంచి తొలగించారు. ప్రస్తుతం ఈ పద్దెనిమిది పరిశ్రమ లను ఐదుకు తగ్గించారు.

తప్పనిసరిగా లైసెన్సు పొందాల్సినవి..

- మద్యం తయారీ
- చుట్టలు, సిగరెట్లు, ఇతర పొగాకు వస్తువులు
- ఎలక్ట్రానిక్ ఏరోస్పేస్ రక్షణ సామగ్రి
- పారిశ్రామిక పేలుడు పదార్థాలు
- ప్రమాదకర రసాయనాలు

ప్రభుత్వ రంగానికి రిజర్వ్ చేసినవి

1956 విధానంలో ప్రభుత్వ రంగానికి 17 రకాల పరిశ్రమలను రిజర్వ్ చేశారు. వీటిని 8 పరిశ్రమలకు కుదించి మిగిలిన వాటిని ప్రైవేట్ రంగంలో అనుమతించారు. ప్రస్తుతం వీటిని మూడింటికి తగ్గించారు. అవి.. అణుశక్తి, రైలు రవాణా, అణుశక్తి చట్టంలోని షెడ్యూల్‌లో పేర్కొన్న ఖనిజాలు.

ఎంఆర్‌టీపీ చట్ట సవరణ

గతంలో 100 కోట్ల గరిష్ట ఆస్తుల పరిమితి దాటిన సంస్థలు ఈ చట్ట పరిధిలోకి వచ్చేవి. ఈ విధానంలో ఆ పరిమితిని తొలగించారు. కొత్త సంస్థల ఏర్పాటు, సంయోగం, విలీనం విషయంలో ముందస్తు అనుమతి అవసరం లేదు.

విదేశీ పెట్టుబడులు, సాంకేతిక ఒప్పందాల అనుమతి

అత్యంత ప్రాధాన్యం కలిగిన 34 పరిశ్రమల్లోకి విదేశీ పెట్టుబడులను 51 శాతం వరకు అనుమతిస్తారు. వీటిలో విదేశీ సాంకేతిక ఒప్పందాలను కూడా అనుమతిస్తారు.

- బ్రాడ్ బాండింగ్‌ను విస్తరించారు.
- పరిశ్రమల ఏర్పాటులో, స్థల నిర్ణయంలో ఉన్న ఆంక్షలను తొలగించారు. అయితే 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉంటే నగరానికి 25 కి.మీ. ఆవల పరిశ్రమలను స్థాపించాలి.
- ఖాయిలాపడ్డ ప్రభుత్వరంగ సంస్థలను BIFR (పారిశ్రామిక విత్త పునర్నిర్మాణ మండలి)కు నివేదిస్తారు.
- వనరులను సమీకరించడానికి ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను మ్యూచువల్ ఫండ్స్‌కు, విత్త సంస్థలకు, ప్రజలకు విక్రయిస్తారు.
- ప్రభుత్వ రంగ సంస్థలకు ఎక్కువ స్వేచ్ఛనిచ్చి జవాబుదారీతనం పెంచడానికి మెమొరాండమ్ ఆఫ్ అండర్‌స్టాడింగ్(MOU)ను అమలు చేస్తారు.
- విదేశీ పెట్టుబడుల ప్రతిపాదనలు పరిశీలించి అనుమతి ఇవ్వడానికి విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డును (FIPB) ప్రారంభించారు.
- 1991 ఆగస్టులో 2వ దఫా నూతన పారిశ్రామిక విధానం చిన్న పరిశ్రమలకు సంబంధించింది.
- చిన్న పరిశ్రమల నిర్వచనాన్ని విస్తరించింది. తయారీ పరిశ్రమలే కాక పరిశ్రమలకు సంబంధించిన సేవలు, వ్యాపార సంస్థలు కూడా ఈ నిర్వచనం పరిధిలోకి వస్తాయి.
- చాలా చిన్న రంగంలో పరిశ్రమలకు పెట్టుబడి పరిమితిని 5 లక్షలకు, చిన్నతరహా పరిశ్రమల్లో 60 లక్షలకు, అనుషంగిక పరిశ్రమల్లో 75 లక్షలకు పెంచారు.
- చిన్నతరహా పరిశ్రమలకు రిజర్వ్ చేసిన వస్తువుల సంఖ్యను 2008 డిసెంబర్ నాటికి 21కి తగ్గించారు.

సమీక్ష: పారిశ్రామిక లైసెన్సింగ్ రద్దు, ఎంఆర్‌టీపీ చట్టంలో గల ఆస్తుల గరిష్ట పరిమితిని తొలగించడం, ప్రభుత్వ పరిధిని కుదించడం, పారిశ్రామిక రంగంలోని నియంత్రణలు సడలించడం, విదేశీ మూలధనాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వేచ్ఛగా అనుమతించడం ఆహ్వానించదగ్గ పరిణామాలే. అయితే ప్రభుత్వం స్వావలంబన, జాతీయ భావ పరిరక్షణ లాంటి అంశాలు విస్మరించిందని, వృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి, ఆర్థిక న్యాయమనే లక్ష్యాన్ని విడనాడిందనే విమర్శకు గురైంది.

పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం

- పరిశ్రమల (అభివృద్ధి, క్రమబద్ధీకరణ) చట్టం 1951లో రూపొందింది. ఇదే మొదటి పారిశ్రామిక లైసెన్సింగ్ చట్టం.
- ఈ చట్టం పనితీరును పరిశీలించడానికి 1966లో ఆర్.కె. హజారీ కమిటీ, 1967లో 'సుబుమిల్ దత్' కమిటీలను నియమించారు. ఈ రెండు కమిటీలు పారిశ్రామిక లైసెన్సింగ్ విధానంలో గల లోపాలను ఎత్తిచూపాయి.
- 'దత్' కమిటీ సిఫార్సుల మేరకు 1969లో ఎంఆర్‌టీపీ చట్టం, 1970లో ఎంఆర్‌టీపీ కమిషన్, పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం

రూపొందాయి.

ఎంఆర్‌టీపీ చట్టం

పెద్ద పారిశ్రామిక సంస్థల గుత్తాధిపత్య ధోరణులను అరికట్టడానికి ప్రభుత్వం ఎంఆర్‌టీపీ చట్టాన్ని చేసింది. ఈ చట్టం కిందకు రూ.20 కోట్ల ఆస్తులు దాటిన పారిశ్రామిక సంస్థలు వస్తాయి. 1985లో ఈ పరిమితిని రూ.100 కోట్లకు పెంచింది. 1991లో ఈ గరిష్ట ఆస్తుల పరిమితిని ఎత్తి వేసింది. ఎంఆర్‌టీపీ చట్టాన్ని రద్దు చేసి, 'పోటీ చట్టాన్ని' ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

పోటీ చట్టం 2002 (Competition Act)

ఎస్.వి.ఎస్. రాఘవన్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సుల మేరకు ఎంఆర్ టీపీ స్థానంలో పోటీ చట్టం ఏర్పడింది. పోటీ వ్యతిరేక ఒప్పందాలు నిరోధించడమే దీని ప్రధాన లక్ష్యం. ఎంఆర్‌టీపీ కమిషన్ స్థానంలో ''కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా'' ఏర్పడింది.

భారత్... ప్రత్యేక ఆర్థిక మండళ్లు!

భారీ పారిశ్రామికీకరణ సాధించే దిశగా... తమ ఆర్థిక వ్యవస్థల వృద్ధికి ప్రత్యేక ఆర్థిక మండళ్లు(సెజ్‌లు) ఇంజిన్‌లా ఉపయోగపడతాయని భావిస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలు... వీటి ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయి. సెజ్‌ల కారణంగా పెట్టుబడులు వేగవంతమై.. ఆర్థిక కార్యకలాపాలు విస్తృతమవుతాయి. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి!!

ప్రాంతీయ సమతౌల్య ప్రగతి ధ్యేయంగా.. మన దేశంలో అభివృద్ధి చెందిన ప్రాంతాలలోనే కాకుండా.. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలోనూ సెజ్‌ల ఏర్పాటును ప్రోత్సహించాలి. వ్యవసాయ యోగ్యం కాని భూములను సెజ్‌ల కోసం కేటాయిస్తూ... వ్యవసాయరంగ అభివృద్ధికి భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవాలి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు హర్షణీయం. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన సెజ్‌లలో... 50 శాతం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులలోనే ఏర్పాటయ్యాయి. వెనుకబడిన కచ్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో... 1965లో గుజరాత్‌లోని కాండ్లాలో ఏర్పాటు చేసిన స్వేచ్ఛా వాణిజ్య మండలి (Free Trade Zone)... 1966-67లో తన కార్యకలా పాలు ప్రారంభించింది. 1974లో ముంబయిలో ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి శాంతాక్రజ్ ఎలక్ట్రానిక్స్ ఎగుమతి ప్రాసెసింగ్ జోన్‌ను... 1986లో వజ్రాలు, ఆభరణాలకు (Gems and Jewellery) విస్తరించారు. 1980లలో Export Oriented Units (ఎగుమతులకు సంబంధించిన యూనిట్లు) పథకాన్ని ప్రారంభించారు. 1986లో 4 ఎగుమతి ప్రాసెసింగ్ జోన్‌లను మద్రాస్, నోయిడా, ఫాల్టా (కలకత్తా వద్ద), కొచ్చిన్‌లలో ఏర్పాటు చేశారు. 1989లో ఆమోదం పొందిన విశాఖ పట్టణం ఎగుమతి ప్రాసెసింగ్ జోన్... 1994లో తన కార్యకలాపాలు ప్రారంభించింది. కొన్ని ముఖ్యమైన ప్రోత్సాహకాలను ఇస్తూ... ఎగుమతి-దిగుమతి విధానం- 2000, సెక్షన్ 9-ఎ.. 4 ఎగుమతి ప్రాసెసింగ్ జోన్(EPZ)లను ప్రత్యేక ఆర్థిక మండళ్లు(SEZ)గా మార్చింది.

సెజ్‌ల ప్రాధాన్యం :

సెజ్‌ల ఏర్పాటు వల్ల ఆర్థిక కార్యకలాపాలు విస్తృతమవటం... వస్తు, సేవల ఎగుమతులు పెరగటం.. స్వదేశీ, విదేశీ పెట్టుబడులు ఆకర్షించటం.. ఉపాధి అవకాశాలు పెరగటం... ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగుపరచటం... వంటి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పారిశ్రామికీకరణ సాధించే దిశగా తమ ఆర్థిక వ్యవస్థలలో వృద్ధిని పెంపొందించటానికి సెజ్‌లు ఇంజన్‌లాగా ఉపయోగపడతాయని అభివృద్ధి చెందిన దేశాలు భావిస్తున్నాయి. 1980లకు ముందుకాలంలో Deng Xiaoping సారథ్యంలో రిపబ్లిక్ ఆఫ్ చైనా సెజ్‌లను ప్రవేశపెట్టింది. చైనాను ఆదర్శంగా తీసుకొని చాలా దేశాలు సెజ్‌లను ఏర్పాటు చేశాయి. సెజ్‌ల ఏర్పాటు తర్వాత దక్షిణ కొరియా ఆర్థిక ప్రగతి పెరిగి, శ్రామికశక్తి నైపుణ్యం మెరుగైంది.

భారత్‌లో సెజ్‌ల విధానం:

ఎగుమతులపై ఉన్న నియంత్రణ తొలగించటం ద్వారా... అంతర్జాతీయస్థాయి మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ.. విదేశీ పెట్టుబడులను ఎక్కువగా ఆకర్షించాలనే ఉద్దేశంతో... ప్రత్యేక ఆర్థిక మండళ్ల (sez) విధానాన్ని 2000, ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలో తయారీ ఉత్పత్తుల hubగా భారత్‌ను రూపొందించాలంటే... రాబోయే 5 ఏళ్లలో శ్రామికశక్తికి అదనంగా తోడయ్యే 71 మిలియన్ల యువతకు ఉపాధి కల్పించాల్సిన అవసరముంది. భారీ పారిశ్రామికీకరణ ధ్యేయంగా... సెజ్ యూనిట్లకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ప్రకటించింది. తయారీ ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించిన యూనిట్లలో... 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అనుమతి.. ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం చేసే అన్ని దిగుమతులపై డ్యూటీ మినహాయింపు.. వ్యాపార ఆదాయంపై ఆదాయపన్ను విరామం... వ్యాట్, ఇతర పన్నుల మినహాయింపు.. సెజ్‌లలో ఏర్పాటయ్యే టౌన్‌షిప్‌ల అభివృద్ధికి స్వేచ్ఛనివ్వడం... వంటి ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. భారత ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం... ఇప్పటివరకు ఆమోదించిన 439 సెజ్‌లలో... 150 టెక్స్‌టైల్స్, అపెరల్స్, తోలు ఉత్పత్తులు, ఆటోమొబైల్ పరికరాలకు సంబంధించినవి. వీటిలో.. నేర్పరితనం లేనివారు, semi skilled యువకులు, మహిళలు, భూమిలేని కార్మికులు, సెజ్‌ల ఏర్పాటులో భూమి కోల్పోయినవారికి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయి. శ్రీపెరంబదూర్‌లో ఏర్పాటైన నోకియా సెజ్‌లో 9,645 మందికి, ఫ్లెక్స్‌ట్రోనిక్స్ సెజ్‌లో 2,069 మందికి ఉపాధి లభించగా.. వీరిలో ఎక్కువ మంది మహిళలు.

హైదరాబాద్‌లోని GEMS సెజ్... ప్రస్తుతం 1200 మంది మహిళలకు, 800 మంది పురుషులకు ఉపాధి కల్పించింది. రాబోయే రోజుల్లో మరో 30,000 మందికి ఉపాధి కల్పించగలదని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన Appache, shoes తయారీ సెజ్... ప్రస్తుతం 4500 మందికి ఉపాధి అందించింది. ఈ సెజ్ తన లక్ష్యమైన మిలియన్ జత shoe తయారీని సాధిస్తే... అదనంగా మరో 20,000 మందికి ఉపాధి లభిస్తుంది. శ్రీలంకకు చెందిన FDI project, Brandix apparel ప్రాజెక్టులు రాబోయే 3 ఏళ్లలో... 60,000 మందికి ఉపాధి కల్పించగలవు. భవిష్యత్తులో శ్రమసాంద్రత

రంగాలలో మరిన్ని సెజ్‌లు ఏర్పాటయ్యే అవకాశమున్నందున భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సాంఘిక అవస్థాపనా సౌకర్యాలైన ఆసుపత్రులు, పాఠశాలలు, గృహ నిర్మాణాలను... సెజ్‌లలో ఏర్పాటు చేయకుంటే.. సెజ్‌ల బయట లభ్యమయ్యే మౌలిక సదుపాయాలపై ఇంకా ఒత్తిడి పెరుగుతుంది. సెజ్‌లలో సాంఘిక మౌలిక సౌకర్యాలను మెరుగుపరచడానికి అవసరమైన కనీస ప్రాసెసింగ్ ఏరియాను ప్రభుత్వం 35 శాతం నుంచి 50 శాతానికి పెంచింది. 2007-08లో సెజ్‌ల ద్వారా ఎగుమతుల లక్ష్యం రూ.67,300 కోట్లు. కాగా రూ.66,638 కోట్లు సాధించారు. 2008-09లో ఎగుమతుల ఆదాయం రూ. 1,35,000 కోట్లు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఏర్పాటైన సెజ్‌లలోని 1016 యూనిట్లు... ప్రత్యక్షంగా 1.79 లక్షల మందికి ఉపాధి అందించగా.. వీరిలో 40 శాతం మహిళలు.

సెజ్‌ల ఆవశ్యకత:

స్వాతంత్ర్యానంతరం మన దేశ పారిశ్రామిక రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. 1991లో సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో... పారిశ్రామిక రంగంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టింది. అయినా అంతకుముందు కాలం కన్నా.. సంస్కరణల యుగంలో పారిశ్రామికాభివృద్ధి క్షీణించింది. సంస్కరణల యుగంలో... ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గటం.. ప్రపంచీకరణ నేపథ్యంలో పోటీతత్వం పెరగటం.. మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో లభ్యం కాకపోవటం.. పారిశ్రామికరంగ విస్తరణకు అవసరమైన నిధులు లభించకపోవటం.. ఎగుమతుల వృద్ధి తగ్గటం.. గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి మందగించటం... వంటి సమస్యల కారణంగా పారిశ్రామికరంగ వృద్ధి క్షీణించింది. ఆశించిన స్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా సమకూరలేదు. ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ వేగవంతం కానందువల్ల... ప్రభుత్వ వనరులు తగ్గి, మౌలిక సౌకర్యాలు కుంటుపడ్డాయి. ఆదాయ, ప్రాంతీయ అసమానతలు తగ్గింపు.. భారీగా ఉపాధి కల్పన ధ్యేయంగా ప్రోత్సాహం పొందిన చిన్నతరహా పరిశ్రమలు కార్యాచరణలో విఫలమయ్యాయి. మౌలిక సౌకర్యాల కల్పనలో ప్రయివేటు రంగానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ప్రకటించినప్పటికీ... ప్రయివేటు పెట్టుబడులను ఆశించిన మేర ఆకర్షించలేకపోయింది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే... స్థూల మూలధన కల్పనలో చాలా వెనుకబడి ఉండటం.. జరుగుతున్న వృద్ధికి అనుపాతంగా ఉపాధి పెరగకపోవటం.. ప్రపంచీకరణ నేపథ్యంలో పోటీతత్వం పెరగటం వల్ల ఎక్కువ విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించలేక పోవటం... వంటి పరిస్థితుల కారణంగా ప్రత్యేక ఆర్థిక మండళ్లను మన దేశం ప్రోత్సహించాల్సిన అవసరం ఏర్పడింది.

సెజ్‌లు.. సమస్యలు :

ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌లుగా.. ప్రత్యేక ఆర్థిక మండళ్లను ఉద్దేశించినప్పటికీ... వీటి ఏర్పాటులో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. వాణిజ్య మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం... మొత్తం భూ విస్తీర్ణం 29,73,190 చదరపు కిలోమీటర్లలో... ఇప్పటివరకు ఆమోదించిన 439 సెజ్‌లకు 596 చదరపు కిలోమీటర్లు... నోటిపై చేసిన 195 సెజ్‌లకు 260 చదరపు కిలోమీటర్ల భూమి అవసరం. సెజ్‌లకు అవసరమైన మొత్తం 856 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని... వ్యవసాయ భూమి 16,20,388 చదరపు కిలోమీటర్ల నుంచి కేటాయించాలా? లేదా 13,52,802 చదరపు కిలోమీటర్ల వ్యవసాయేతర భూమి నుంచి కేటాయించాలా? అనే విషయాన్ని ప్రభుత్వం నిర్ధారించలేదు.

ప్రభుత్వం వ్యవసాయ భూమి అని స్పెసిఫై చేసింది. కాని కల్పివ బుల్ ల్యాండ్ అని పేర్కొనలేదు. రైతుల నుంచి చాలా తక్కువ ధరలకు భూములను తీసుకోవాలని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నందువల్ల... సెజ్‌ల అభివృద్ధికి వారి నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వ్యవసాయ భూములలో సెజ్‌లు ఏర్పాటు చేస్తుండటంతో.. రైతులు తమ జీవనోపాధి కోల్పోతున్నారు. వీరు నైపుణ్యం గల శ్రామికులు కాకపోవటంతో ఇతర ఉపాధి చేపట్టలేరు. సెజ్‌లో ఏర్పాటయ్యే యూనిట్లకు ప్రభుత్వం ప్రకటించిన పన్ను విరామాలు, అనేక ప్రోత్సాహకాలు... భవిష్యత్తులో దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావాన్ని చూపే ఆస్కారముంది. పన్ను- జీడీపీ నిష్పత్తిలో... ఇంకా తగ్గుదల సంభవించే సూచనలు కనిపిస్తున్నాయి. సెజ్‌లను విచక్షణారహితంగా అనుమతించినందువల్ల వ్యవసాయం, ఆహారభద్రత, ఆర్థికస్థితులపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. ప్రయివేటు ప్రమోటర్స్ భూమిని చాలా చౌకగా పొందుతూ... రియల్‌ఎస్టేట్ రంగ అభివృద్ధి, అంచనా వ్యాపారం (స్పెక్యులేషన్) ద్వారా... అధిక లాభాలు ఆర్జించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

సమస్యలు... నివారణ :

భూమిపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులను అభివృద్ధి ప్రక్రియలో నిర్లక్ష్యం చేయకూడదు. వ్యవసాయ యోగ్యమైన భూములను సెజ్‌లకు కేటాయించకుండా... బంజరు భూములు, వృధాగా ఉన్న భూములను సెజ్‌లకు కేటాయించి... మౌలిక సౌకర్యాలు కల్పించే బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలి. సెజ్‌లకు కేటాయించే భూముల మొత్తంపై పరిమితి విధించాలి. పన్ను మినహాయింపు ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ... వాటిని దశల వారీగా తొలగించాలి. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి పునరావాసానికి చర్యలు తీసుకోవాలి. సెజ్ చట్టంలో మార్పులు తీసుకువచ్చేటపుడు ఇతర రాజకీయ పార్టీల మద్దతు పొందాలి. సెజ్‌కు కేటాయించిన భూమిలో... 50 శాతం ఇండస్ట్రీల ఏర్పాటుకు; 25 శాతం మౌలిక సౌకర్యాలు ఏర్పాటుకు; మిగతా 25 శాతం ఇతర అవసరాలకు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

వ్యవసాయరంగం పెరుగుతున్న శ్రామిక శక్తికి ఉపాధి కల్పించలేదు. కాబట్టి సెజ్‌ల ఏర్పాటు ద్వారా పారిశ్రామికీకరణ వేగవంతం చేసి, ఉపాధిని పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 91 సెజ్‌లకు ఆమోదం పొందటమే కాక ఐ.టి. రంగంలో 40 సెజ్‌లను, ప్రయివేటు రంగంలో 15 ఐ.టి. పార్కుల ఏర్పాటుకు

ప్రయత్నిస్తూ... పెరుగుతున్న యువతకు ఉపాధి అందించాలనే దృక్పథంలో పని చేస్తుండటం ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయం!!